సూర్య ప్రసాద్, పడాల చారిటబుల్ ట్రస్ట్, కాకినాడ
+91 73311 23044; padalasurya@yahoo.com

# తర 'గతి' తప్పుతున్న పాఠశాల విద్య

## ఓ సామాన్యుడి ప్రస్థానం

ఒక దిగువ మధ్య తరగతిలో పుట్టి, తన చుట్టూ ఉన్న వ్యక్తుల సాయంతో అంచెలంచెలుగా ఎదిగి, చుక్కల్లో చూపు చిక్కుకోనివ్వకుండా, రుణం తీర్చు తరుణం వచ్చాక, తప్పించుకు పోకుండా సమాజ హితమే నా హితమంటూ తన మూలాలకు చేరుకొని, విద్యా వ్యవస్థలో సమస్యలకు స్పందిస్తూ, ప్రశ్నిస్తూ, సూచనలిస్తూ, పరిష్కారాలలో భాగమవుతూ, వ్యవస్థ ప్రక్షాళన కోసం పరితపిస్తున్న ఒక సామాన్యుడి ప్రస్థానం ఇది.

5 వ తరగతి దాకా చదివిన మా నాన్న ఒక దర్జీ. అసలు ఏ చదువూ లేకుండా ఒక చిన్న బడ్డీ దుకాణం నడుపుతూ, పుల్లలు కొడుతూ, ఇడ్లీలు, అట్లు అమ్ముతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేది మా అమ్మ వరాలమ్మ. 7 వ తరగతి వరకు మా ఊరు ఏలేశ్వరం ప్రభుత్వ పాఠశాల లో చదివిన నాకు మా ఉపాధ్యాయులే దేవుళ్ళు. మా హింది టీచర్ శ్రీమతి విజయ గారి దత్త పుత్రుడిగా పేరుండే నన్ను మా ఉపాధ్యాయులంతా చందాలు వేసుకుని కాకినాడ తీసుకువచ్చి రాయించిన పరీక్ష ఆం. ప్ర. గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష (APRS Entrance Test). అందులో ఉత్తీర్ణత పొందాక 3 సం. లు (8th – 10th) నా చదువంతా APRS భూపతిపాలెం లో సాగింది. 10 వ తరగతిలో వచ్చిన స్టేట్ 2 వ ర్యాంక్ (1988 Batch) వల్ల APRJC నాగార్జున సాగర్ లో  ఇంటర్ కోర్స్ కి మార్గం సులువైంది. అది పూర్తయ్యాక అక్కడి నుండి నెల్లూరు లోని నారాయణ కోచింగ్ సెంటర్ కి మకాం మార్చి EAMCET కి పూర్తి ఉచిత శిక్షణ ఇప్పించారు. EAMCETలో 483 ర్యాంక్ రాగానే ఇంటికి దగ్గరలో ఉన్న కాకినాడలో 4 సం. లు ఇంజనీరింగ్ చదివేసి వెంటనే ఉద్యోగం తెచ్చేసుకుని అమ్మ నడిపే కిరాణా షాప్, నాన్న కుట్టు మిషన్ ఆపెయ్యాలనే లక్ష్యంతో ఉన్న నాకు మా నాన్న మాటలు శరాఘాతం లా తగిలాయి.

*"నేను రోజుకు 2-3 జతల బట్టలు కుడతాను, అక్కడ మీ అమ్మ కిరాణా సామానులు అమ్ముతుంది. నిన్ను, తమ్ముడిని ఇంతదాకా చదివించడమే గొప్ప. ఇప్పుడు కౌన్సిలింగ్ కి డబ్బులు కట్టాలి, కాకినాడ లో 4 సం. లు చదవాలి. హాస్టల్లో ఉండాలి, 40-50 వేలు ఖర్చవుతాయి అంటే ఎక్కడినుండి తీసుకురావాలి. ఆ ఖరీదైన చదువులు మనకి కాదు. నువ్వు నీ సర్టిఫికెట్స్, ర్యాంక్ కార్డ్ అన్నీ లోపల పడేసి వచ్చి నా ప్రక్కన కూర్చుంటే, ఒక్క సంవత్సరం తిరిగే లోపు నిన్ను మన ఊళ్ళో నంబర్ 1 దర్జీగా తయారు చేస్తాను. కాబట్టి నా మాట విని నీ చదువు ఆపేయ్."*

చదువుకోవడానికి మార్కులుండాలి, ర్యాంకులు రావాలి, ఆసక్తి ఉండాలి. కాని డబ్బులు దేనికి? ఆ వయసులో నాకర్థమయ్యేది కాదు. తిండి తినకుండా, నిద్ర లేని రాత్రులు గడిపే నాకు మా ఊళ్ళో పెద్ద మనసున్న మనుషులు ఒక థియేటర్ లో సినిమా ద్వారా  బెనిఫిట్ షో (fundraising event) వేసి 6 వేల రూపాయలు మా ఇంట్లో ఇచ్చి వెళ్ళారు. ఆ డబ్బు అప్పటి అవసరం తీర్చినా తరువాత 4 సం.లు ఇంజనీరింగ్ చదువెలాగో అర్ధం కాలేదు. ఆ సమయంలో BREAD

(మరో పేరు North South Foundation) అనే ఒక సంస్థ ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తుందని తెలిసి, వారిని సంప్రదించిన పిదప, నేనింక వెనక్కి తిరిగి చూసుకోలేదు.

కాకినాడ లో ఇంజనీరింగ్, IIT ఖరగ్ పూర్ లో M.Tech, Tata Consultancy Services (TCS) లో ఉద్యోగం రావడం చక చకా జరిగిపోయాయి. 1997 ఏప్రిల్ లో Project Lead గా ప్రమోట్ అయ్యి అమెరికా (Memphis, TN) లో అడుగు పెట్టాక నాకు నా గతమంతా ఒకసారి మెదిలింది. చిన్నప్పటి స్నేహితులు, ఉపాధ్యాయులు, ఊరి వాళ్ళు, ఒక స్వచ్ఛంద సంస్థ ఇలా **ఇంతమంది ఇన్ని రకాలుగా నీళ్ళు పోసి నీడనిస్తే ఎదిగిన ఒక మొక్క లాంటి జీవితం** కదా నాది. ఇప్పుడు ఒక చెట్టుగా ఎదిగాక నీళ్ళు పోసిన వాళ్ళని, నీడనిచ్చిన వాళ్ళని మర్చిపోకుండా, ఇప్పుడు నా నీడలో 100 మంది సేద తీరే విధంగా నా జీవితం ఉండాలి కదా అన్న భావన కలిగిన మరు క్షణం ఏర్పాటైన సంస్థ **పడాల చారిటబుల్ ట్రస్ట్**. ప్రతిభ ఉండి, పై చదువులపై ఆసక్తి ఉన్న ఏ పేద విద్యార్థి భవిష్యత్తు ఆగకూడదు అనే సంకల్పంతో 2002 నుండి స్కాలర్షిప్స్ ఇవ్వడం ప్రారంభించి 2018 ఆగస్ట్ నాటికి 763 మందికి సుమారు 34 లక్షల దాకా డొనేట్ చెయ్యడం జరిగింది. PCT ద్వారా లబ్ధి పొంది జీవితంలో మంచి ఉద్యోగాల్లో స్థిరపడి, కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ తమ పరిధిలో పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్న డాక్టర్స్, ఇంజనీర్లు, టీచర్లు, బ్యాంక్ ఆఫీసర్స్, ప్రభుత్వ ఉద్యోగులు చాలా మంది ఉన్నారు.

ప్రతీ సంవత్సరం 2 నెలలు సెలవు పెట్టి స్కాలర్షిప్ ప్రోగ్రాం కోసం ఇండియా వస్తున్నా, ఇంతేనా నేను చెయ్యగలిగేది అనే ఒక రకమైన అసంతృప్తి ఉండేది.

అమెరికా లో 16 సంవత్సరాల ఉద్యోగం, నివాసం తరువాత, అక్కడి పౌరసత్వం కూడా తీసుకున్న పిదప నా అసంతృప్తి తారాస్థాయికి చేరింది. ఇన్నాళ్ళు నాకు ఉద్యోగ రూపంలో ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశమిచ్చిన అమెరికా దేశానికి, నేను పని చేసిన అన్ని కంపెనీ వాళ్ళకీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుని, భార్యా పిల్లలతో 2012 డిశంబర్ 10 న Air India Flight one way టికెట్ తీసుకుని భారత దేశం తిరుగు ప్రయాణం అయ్యాను. నా 40 వ పుట్టిన రోజుకి 2 వారాల ముందుగానే 12.12.12 తేదిన ఇండియా లో అడుగు పెట్టిన ఆ ఉద్వేగ క్షణాల్లో నా ఆలోచనలు ఇంకా నాకు స్పష్టంగా గుర్తున్నాయి.

## నెక్స్ట్ ఏంటి?

ఇక నుండి నా జీవితం సమాజ హితం కోసం అంకితం. పాఠశాలల చుట్టూ తిరగాలి. విద్యార్థులతో, ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో మాట్లాడాలి. విద్యా వ్యవస్థ లో ఉన్న సమస్యల గురించి ఆలోచించాలి. కాని ఆ సమస్యలని ఆసక్తి కరమైన పిచ్చాపాటి కబుర్లులా చెప్పుకుంటూ, నిట్టూర్పులు విడుస్తూ కాలం గడిపేసే బాపతులా కాకుండా... పరిష్కార మార్గాలు అన్వేషించాలి. వాటిలో భాగం కావాలి. రేపటి తరం బాగుండాలి. ప్రభుత్వ పాఠశాల లకు పూర్వ వైభవం రావాలి. సమాజంలో ఉపాధ్యాయుల మీద ఇంతకు ముందున్న గౌరవం తిరిగి రావాలి. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి సమాజోద్ధారకులుగా తయారుచేయాలి. ఇలా చాలా స్థిరమైన ఆలోచనలతో పడాల చారిటబుల్ ట్రస్ట్ వేదికగా చేసుకుని ప్రయత్నాలు మొదలు పెట్టాం నేను నా టీం. అయితే ఈ 6 సం. లలో నిజంగా ఎంత సాధించాము అని వ్యక్తిగతంగా ప్రశ్నించుకుంటే...కొన్ని సమస్యలకు పరిష్కార మార్గాలు వెదకడంలో, ఒకే భావ జాలం ఉన్న వ్యక్తులను, సంస్థలను కలుపుకోవడంలో తృప్తిగా ఉన్నా జబ్బలు

చరుచుకునే పరిస్థితి అయితే లేదు. మాకున్న పరిమిత వనరులతో, పాఠశాల స్థాయి విద్యార్థుల ఆలోచనా విధానాన్ని సరైన దిశగా మళ్లిస్తూ, కెరియర్ అవకాశాలపై అవగాహన కల్పిస్తూ, కౌమార దశ సమస్యలు, సవాళ్ళ గురించి బాహాటంగా చర్చిస్తూ, **చదువు, గెలుపు, జీవితం** అనే పదాలకు అసలు సిసలైన అర్థాలు వివరిస్తూ, సమాజాన్ని నడిపించగల రేపటి నాయకులను తయారుచేసే పనిలో కొంతవరకు సఫలీకృతం అవుతున్నాము. కాని మేం చూస్తున్నది, చేస్తున్నది మంచు కొండ యొక్క కొన (tip of the ice berg) మాత్రమే. విద్యా ప్రమాణాల విషయంలో మరియు విద్యార్థులకు ప్రేరణ, జీవన నైపుణ్యాలు, నాయకత్వ నిర్మాణం విషయంలో వ్యవస్థలో విధాన స్థాయి మార్పులు రావాలి.

ఈ రోజు పిల్లలు విద్యావంతులు కావడం లేదు. కేవలం అక్షరాస్యులుగా తయారుచేయబడుతున్నారు. బావులుండీ నీళ్ళు లేనట్టు – పాఠశాలలున్నాయి, కాని విద్య లేదు; పరీక్షలున్నాయి, కాని ప్రమాణాలు లేవు; బడి నిండా మేధావులైన ఉపాధ్యాయులున్నారు, కాని పిల్లలకు విలువలు అబ్బటం లేదు.

**కొన్ని ఉదాహరణలు –**

1) ఒక వెయ్యి మంది 9 వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి నపుడు 'ANGER కి ANGRY కి తేడా ఏంటమ్మా' అని అడిగితే కేవలం ఒక్క అమ్మాయి మాత్రమే సమాధానం చెప్పగలిగింది.

2) మీ ఆట స్థలం (playground) చుట్టుకొలత ఎంత?

3) మీ ఇంటి వైశాల్యం, మీ పాఠశాల వైశాల్యంలో ఎంత శాతం (%)ఉంటుంది?

4) అసలు మీ ఊళ్ళో ఉన్న పోస్ట్ ఆఫీస్, బ్యాంక్ లలో ఏం జరుగుతుంది? అవి గ్రామానికి ఏ రకంగా ఉపయోగపడతాయి?

5) మీరు ప్రతీ సంవత్సరం కట్టే ఇంటి పన్ను, పొలం పన్ను, కుళాయి పన్ను, గ్రంధాలయం పన్ను ఎవరికి చేరతాయి? ఆ డబ్బులు ఏమైపోతున్నాయి?

15 సం. ల వయసు వచ్చి, గత 10 సం. లుగా బళ్ళో చదివేసుకుంటున్న మన పిల్లలకు ఇలాంటి విషయాల మీద కనీస అవగాహన లేకపోతే, మనకి భయం ఎందుకు వేయడం లేదు? ప్రశాంతంగా ఎలా నిద్రపోగలుగుతున్నాం?

విద్యారంగంలో ఉన్న అన్ని సమస్యలు ఒక్క రోజులో పరిష్కారమయ్యేవి కావు. కాని మనసు పెట్టి ఆలోచిస్తే ప్రతీ సమస్యనీ ఒక కొలిక్కి తీసుకురావచ్చు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు, జిల్లా స్థాయి విద్యా శాఖాధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులు, మీడియా, యువత, స్వచ్ఛంద సంస్థలు, ఇలా ప్రతీ వర్గం ఒక్కొక్క సమస్యని, దాని తీవ్రతని అర్థం చేసుకుని పరిష్కారాలు అన్వేషిస్తే అందరం కలలు కంటున్నవిలువల సమాజం ఏర్పడుతుంది. అదే మన తరువాత తరానికి మనమిచ్చే వెల కట్టలేని బహుమతి.

## పదవ తర"గతి" మారాలి

మా బోటి వాళ్లకి ఒక సమస్య కూడా ఉంది. మాకు ఎదురుగా ఉన్న పరిస్థితులు, సమస్యలు, జరుగుతున్న తప్పులు కనపడతాయి తప్ప వాటిలో పూర్తి లోతు మాకు తెలియదు. ఆ విశ్లేషణా సామర్థ్యం మాకు ఉండదేమో? అది తెలిసిన వాళ్ళు మాకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తే మేం నేర్చుకోవడానికి సిద్ధం.

**ఉదాహరణకు** – పరీక్షలు పారదర్శకంగా జరగాలి. అవి సమ్మేటివ్ అయినా ఫార్మేటివ్ అయినా; ఒకటో తరగతి అయినా, పదవ తరగతి అయినా. స్వచ్ఛ పరీక్షల ద్వారా మాత్రమే స్వచ్ఛ నాయకులు *తయారౌతారు. స్వచ్ఛ నాయకుల వల్ల మాత్రమే స్వచ్ఛ సమాజం సాధ్యపడుతుంది* అనే ఆలోచనతో, ఆవేదనతో, **స్వచ్ఛ పరీక్షా ప్రచార కార్యక్రమం (CLean Exam Campaign)** చేపట్టడం జరిగింది. అయితే దానివల్ల ఎంత మార్పు తీసుకురాగలిగాం అనే విషయం ప్రక్కన పెడితే, అసలు అది ఎవరికీ సమస్య లాగా కనిపించకపోవడం, స్పందించాల్సిన వర్గాలు స్పందించకపోవడం తీవ్ర మనస్తాపానికి గురి చేస్తున్న విషయం.

పరీక్షల్లో చూచి రాతలు తప్పు కదా, బాగా చదివే పిల్లలు నష్టపోతున్నారు కదా, దీని ద్వారా ఎటువంటి విలువలు నేర్పిస్తున్నాం పిల్లలకి అంటే....ఒక్కొక్కడు ఒక్కో సమాధానం చెబుతాడు. పిల్లవాడు ఒకటి చెబుతాడు. పేరెంట్ ఒకటి చెబుతాడు. ఈ రెండు వర్గాలలో అవగాహనా లోపం అనేది సమస్య. కాని సమస్య మీద, దాని పర్యవసానం మీద పూర్తి అవగాహన ఉన్న వర్గాలు (ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, విద్యా శాఖాధికారులు) కూడా ఒక్కొక్కరూ ఒక్కో కారణం చెబుతారు. అందరూ మూకుమ్మడిగా ఒప్పుకునేది ఏంటంటే – *తప్పు జరుగుతుంది, మాకూ తెలుసు, మేమూ చూస్తున్నాం, అందులో involve అవుతున్నాం. కాని దానికి మేం మాత్రం బాధ్యులం కాదు. వేరే వాళ్ళని అడగండి. సమస్య అక్కడుంది. మేము నిమిత్త మాత్రులమే*...ఇదీ వరస.

వ్యవస్థను పీడిస్తున్న ఒక జటిలమైన సమస్య గురించి ఒక స్వచ్ఛంద సంస్థ గళం విప్పింది. మన పరిధిలో మనం సహకారం అందిద్దాం, పరిష్కారంలో భాగం అవుదాం అని ఆలోచించే వర్గం చాలా తక్కువగా ఉన్నారు.

## సమస్య తీవ్రత

1) సంవత్సరం అంతా కష్టపడి చదువుకుంటున్న పిల్లలు ఈ చూచిరాతల మూలంగా ఏడుస్తున్నారు, ఈ విషయం స్వయంగా పిల్లలు, తల్లిదండ్రులు చెబుతున్నారు. IIIT సీట్లు కొంతమంది తెలివైన విద్యార్థులకు మిస్ అవుతున్నాయి.

2) పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ వల్ల కాస్తో, కూస్తో చదివే పిల్లలు కూడా చదవడం మానేస్తున్నారు. కనీసం ప్రీ-ఫైనల్ కి చదివిన స్థాయిలో కూడా చదవడం లేదు. ఇది సాక్షాత్తు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మాట

3) కిర్లంపూడి లో తెలుగు పరీక్ష రాస్తున్న సమయంలో మా అమ్మాయికి స్లిప్ అందివ్వబోతున్న ఇన్విజిలేటర్ ని *"ఏమనుకుంటున్నారు నా గురించి"* అని ఆ స్లిప్స్ విసిరి కొట్టింది. ఈ తరానికి విద్యా బుద్ధులు నేర్పించి

సమాజాన్ని నిర్మించే బాధ్యతలో ఉన్న ఒక ఉపాధ్యాయుడికి ఎదురైన ఈ సంఘటన ఏ రకమైన అనుభవం మిగిల్చి ఉంటుందో, దీనికి కారణాలు అన్వేషించుకుని పరిస్థితి పునరావృతం కాకుండా ఏమి చర్యలు / నిర్ణయాలు తీసుకుంటారో ఆయనకే తెలియాలి.

4) కాకినాడ లో ఒక పరీక్షా కేంద్రం నుండి సోషల్ పేపర్ రాసి బయటకు వస్తున్న ఒక విద్యార్థి ఆనందంగా చేసిన కామెంట్: *"మా రూమ్ లో CC కెమెరా ఉందన్నా, కాని మా వాడు చాలా తెలివైనోడు. తలుపు చాటు నుండి బిట్ పేపర్ అంతా డిక్టేట్ చేసేవాడు. పాస్ గారంటీ."* విద్యార్థుల నుండి ఉపాధ్యాయులకు ఇటువంటి కితాబులు, ఇలాంటి విషయాల్లో రావడం సమాజానికి శ్రేయస్కరం కాదేమో?

5) ఒక సెంటర్ లో పక్కా మాల్ ప్రాక్టీస్ అవుతుందని తెలిసి అక్కడికి వెళ్ళిన మా బృందం తో *మీ మీద భౌతిక దాడులకు దిగుతాం జాగ్రత్త* అని స్వయంగా ఒక ఉపాధ్యాయుడు అనడం చూస్తుంటే ఈ మాస్ కాపీయింగ్ అనే మహమ్మారి ఎలాంటి క్రిమినల్ ఆలోచనలకు తావిస్తుందో అర్థం అవుతుంది. ఆ ఉపాధ్యాయుడి అత్యుత్సాహానికి ఏ పేరు పెట్టాలి? ఇలాంటి ఆలోచనలు ఉన్నవారికి తరగతి గదిలో పిల్లల మధ్య కూర్చునే అర్హత ఉందా?

6) ఇక రాజోల్ సెంటర్ లో జరిగిన నిర్వాకం, ఉపాధ్యాయులను పోలీస్ స్టేషన్ లాకప్ లో పెట్టిన విషయం, వాళ్ళని సస్పెండ్ చేసిన వైనం రాష్ట్రం అంతా మన జిల్లా పేరు మారుమ్రోగేలా చేసింది.

**ఈ సమస్య తీవ్రత అర్థం కావడానికి ఇంత కన్నా దారుణమైన సంఘటనలు ఇంకెన్ని జరగాలి?**

ఇంకా విచిత్రం ఏంటంటే, *"అసలు దేశం లో ఇన్ని సమస్యలుంటే దీని మీదే ఎందుకు పడ్డారు? మా మీద ఎందుకు ఒత్తిడి తెస్తున్నారు? ఇలాంటి తప్పులు జరగడం మామూలే. చేసేవాళ్ళకి, చూసే వాళ్లకి అందరికీ అలవాటైపోయింది."* ఇవీ కొందరి నుండి మాకు వినిపించే సూక్తి ముక్తావళి.

**విద్యా వ్యవస్థ సమస్యలే ఎందుకు ప్రధానం?**

ఎందుకంటే విద్యా ప్రమాణాలు దేశ గతిని శాసిస్తాయి కాబట్టి. తరగతి గదిలో సమాజ నిర్మాణం జరుగుతుంది కాబట్టి. నిజాయితీ, ప్రశ్నించే తత్వం, నాయకత్వ నిర్మాణం పాఠశాల దశలోనే జరగాలి కాబట్టి. ఈ రోజు పాఠశాల లో విద్యార్థులు ఎంత నిజాయితీగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారో, రేపు సమాజం కూడా అంతే నిజాయితీగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటుంది కాబట్టి – ఆ సమాజంలోనే మనం, మన పిల్లలు కూడా జీవించాలి కాబట్టి. మన పిల్లలను వేరే గ్రహాలకు పంపే అవకాశం లేదు కాబట్టి.

**నాకు దేశభక్తి ఉంది అనుకునే ప్రతీ వాడూ విద్యారంగం గురించి ఆలోచించాలి. సమస్యలను ఒప్పుకోవాలి, ప్రశ్నించడం మొదలుపెట్టాలి, పరిష్కారంలో భాగం కావాలి. సమాజం నుంచి చాలా తీసుకున్నాం, ఎంతో కొంత తిరిగి ఇచ్చెయ్యాలి.**

ఇక్కడ గమ్మత్తైన విషయం ఏంటంటే, మన సమాజాన్ని ఉద్ధరించే నాయకులు రావాలి. వాళ్ళు త్యాగాలు చేయాలి. కాని వాళ్ళంతా పక్కింట్లో పుట్టాలి, మా ఇంట్లో కాదు. ఎదుటివాడు త్యాగం చేస్తుంటే ఆ ఫలాలు నేను అనుభవించాలి. కాని ఒక మంచి మార్పు కోసం చేసే ప్రయత్నం లో నాకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదు. ఇదీ....మన విద్యా వ్యవస్థలో ఉన్న అందరి భాగస్వాముల (stakeholders) ఆలోచనా సరళి. ఇది మారాలి.

## ముగింపు

నేటి విద్యా రంగం బాగు పడితేనే తరువాతి తరం మెరుగైన సమాజంలో బ్రతికే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో పాటు, తరగతి గదిలో ఉన్న పిల్లలను తమ పిల్లలుగా భావించి, వారితో అద్భుతాలు సృష్టిస్తూ, నిరంతర సైనికుల్లా పని చేస్తున్న మెరికల్లాంటి ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటువంటి వారిని ప్రోత్సహించి, అవసరమైన వనరులు కల్పించి, సరైన విధంగా ఉపయోగించుకోవాలి. అలాగే ఉపాధ్యాయ వృత్తి ని కేవలం ఒక ఉద్యోగంలా భావించి, కనీస బాధ్యతలు కూడా నిర్వర్తించకుండా, వ్యవస్థ లో ఉన్న లోపాలను తమ తెలివి తేటలతో వారికి అనువుగా మలచుకుని, విద్యా బుద్దులు నేర్పడం అటుంచి, తమ పిల్లల వయసున్న పాఠశాల విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ, ఉపాధ్యాయ వర్గానికే మచ్చ తీసుకువస్తున్న వారూ ఉన్నారు. ఇలాంటి ప్రభుద్దుల మీద నిఘా పెంచాలి. క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి.

**సంఘాల సంఘటితం:** నాణ్యమైన విద్య, విలువల విద్య అనే అంశాలు ప్రతీ ఉపాధ్యాయ సంఘం అజెండా లో ఉండేవే. కాబట్టి సంఘాల పేర్లతో సంబంధం లేకుండా, అందరూ కలిసికట్టుగా ఉద్యమిస్తే వ్యవస్థలో మార్పు తథ్యం. ఉపాధ్యాయుల జీతభత్యాలు, పదోన్నతులు, ఎన్నికల డ్యూటీ కి వెళ్ళిన వారికి రెమ్యునిరేషన్, సమైక్యాంధ్ర బంద్ లో పాల్గొన్న వారికి ఆ రోజులన్నీ OD గా పరిగణించడం వగైరా ఉపాధ్యాయుల సమస్యలకే పరిమితం కాకుండా, ఉపాధ్యాయుల, వారి సంఘాల ఉనికికే కారణమైన పాఠశాల విద్యార్థుల సమస్యలపై గళం విప్పి, రోడ్డెక్కాల్సిన తరుణం ఆసన్నమైంది. ఒక మహమ్మారిలా వ్యాపించిన మాస్ కాపీయింగ్, తరచూ పాఠశాల లలో దర్శనమిస్తున్న లైంగిక వేధింపుల విషయాల్లో కనీసం స్పందించకుండా మౌనం దాల్చడం భావ్యం కాదు. సంఘాలు కలిసి కదిలినప్పుడు ప్రభుత్వం కూడా దిగి వచ్చిన సందర్భాలున్నాయి. మన పిల్లల కోసం మరో సమిష్టి పోరాటం చేయాల్సిన సమయం వచ్చింది. ఆ ప్రయాణంలో ఎంత దూరం అయినా కలిసి నడవడానికి, ఎలాంటి సహకారం అయినా అందివ్వడానికి మా లాంటి వాళ్ళు సిద్ధంగా ఉన్నారు.

## చివరగా:

సమాజ హితం మా లక్ష్యం.

ఆ సమాజాన్ని నిర్మించే విద్యార్థులే మా ప్రాణం.

ఆ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే ఉపాధ్యాయ మిత్రులే మాకు ఆదర్శం.

ఎటువంటి గుర్తింపు ఆశించకుండా సమాజానికి మా వంతు గా ఎంతో కొంత ఇవ్వడానికే వచ్చాం. చివరి శ్వాస వరకు నిలుస్తాం. మా ఆలోచనలలో, ప్రశ్నల్లో, సూచనల్లో, పరిష్కారాలలో ఉన్న నిజాయితీ, ఆవేదన, సహానుభూతి అర్థం చేసుకుని మాతో కలిసి వచ్చే ప్రతీ ఒక్కరికీ స్వాగతం.